క్లుప్తంగా

పండ్ల పంపిణీ



ములుగు రూరల్: ప్రముఖ సినీ గాయకుడు, పద్మశ్రీ, డాక్టర్ ఘంటసాల వర్ధంతిని ములుగులోని అంబేడ్కర్ భవనంలో స్థానిక గాయకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలపించిన ఎన్నో మధుర గీతాలను స్థానిక కళాకారులు పొరిక శ్యామల్నాయక్, రాణా ప్రతాప్ ఆలపించారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు సంగీతాభిమానుల్ని తన స్వరంతో ఓలలాడించిన మహర్షి ఘంటసాలఅన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రహీముద్దీన్, రాగుల శంకర్, పాలపాక యాకయ్య, మల్లేష్, వనమాల పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



ఏటూరునాగారం: ప్రెస్‌క్లబ్ మండల కమిటీని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నూక ప్రభాకర్, అధ్యక్షుడిగా అఫ్జల్, ప్రధాన కార్యదర్శిగా అలువాల శ్రీనివాస్, కోశాధికారిగా బట్టు గోపి, ఉపాధ్యక్షులుగా కుదురుపాక రాజేష్, ఎంపెల్లి లకుమయ్య, ఎగ్గడి వెంకటేశ్వర్లు, గౌరి శంకర్‌ను ఎన్నుకున్నారు. అలాగే సహాయ కార్యదర్శులుగా ఎంపెల్లి ముత్తేష్, ఇర్సవడ్ల భిక్షపతి, సాయిని శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా బోడ సత్యం, గణపనేని చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెండ్యాల ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా కందుకూరి రవి, పర్వతాల రమేశ్, ప్రతాప్, తిరుమల్, సాయి, శేరి శ్రీను, గోవర్ధన్, గంగాదర్, రమేశ్‌లను నియమించారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులను జర్నలిస్టులు సన్మానించారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కాటారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరంలో శనివారం ఆయన కంటి పరీక్షలు చేసుకున్నారు. శిబిరాన్ని పరిశీలించి సౌకర్యాలు, పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ నాణ్యతతో వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు దబ్బెట రాజేశ్, పవన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



నరేష్(ఫైల్)

చిట్యాల: మతిస్థిమితం కోల్పోయి వ్యక్తి ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సి) గ్రామానికి చెందిన పుల్ల నరేష్(36) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోవడంతో పాటు మానసిక బాధతో ఇంట్లోనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తండ్రి కొడుకులు వేరువేరు గదులలో పడుకున్నారు. కాగా, ఉదయం వెళ్లి చూసే సరికి నరేష్ దూలానికి ఉరివేసుకుని ఉన్నాడు. తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మంగపేట: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ పరిధి మామిడిగూడెంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై తహెర్‌బాబా తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిగూడెంకు చెందిన ఇరుప నర్సమ్మకు ముగ్గురు కుమారులలో ఇద్దరు వేరే గ్రామాల్లో ఉంటున్నారు. పెద్ద వాడైన మృతుడు రాంబాబు(30) తల్లి నర్సమ్మ, నానమ్మ ముత్తమ్మతో కలిసి ఉంటున్నాడు. మద్యానికి బానిసైన రాంబాబు కూలీ పనులకు వెళ్లి వచ్చిన డబ్బులతో నిత్యం మద్యం తాగేవాడు. శుక్రవారం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో తల్లి నర్సమ్మ కూలీకి వెళ్లగా నానమ్మను మద్యం తాగేందుకు డబ్బులు అడిగాడు. దీంతో ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడు. దీంతో స్థానికులు 108 వాహనంలో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ రాంబాబు శనివారం మృతి చెందాడు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పరిమితికి మించి తరలిస్తే చర్యలు



వెంకటాపురం(కె): ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ శివ ప్రసాద్



వాజేడు: అవగాహన కల్పిస్తున్న ఎస్సై తిరుపతిరావు

వెంకటాపురం(కె): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శివప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మిర్చి కోతలు జరుగుతున్నందున కూలీలను ఎక్కువ మందిని ఆటోల్లో తరలించవద్దని అన్నారు. పరిమితికి మించి తరలించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగి నిబంధనలు పాటించాలని సూచించారు.

వాజేడు: పరిమితికి మించి కూలీలను వాహనాల్లో తరలించవద్దని వాజేడు ఎస్సై కొప్పుల తిరుపతిరావు అన్నారు. పోలీస్ స్టేషన్‌లో రైతులు, ట్రాక్టర్ యజమానులు, ఆటో యజమానులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న నేపథ్యంలో కూలీలను పరిమితి మించి తరలించవద్దన్నారు. అతి వేగం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

వెంకటాపురం(కె): అసాంఘీక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బాల బాలికలందరిని తప్పనిసరిగా చదివించాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసుల దృష్టికి తీసుకురావాలని, పై అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు, కొత్త వ్యక్తులు ఎవరైన వస్తే పోలీసులకు అందించలని అన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం ఎస్సై అశోక్ ఉన్నారు.

తీర్మానం లేకుండా కాంట్రాక్టు పనులు



మాట్లాడుతున్న మహ్మద్ యాకూబ్‌పాషా

మంగపేట: మండలంలోని కొందరు అధికారులు, పార్టీల నాయకులు కుమ్మక్కై గ్రామ సభలు నిర్వహించకుండా కాంట్రాక్టు పనులకు వీడీసీలు ఇస్తున్నారని బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకూబ్‌పాషా ఆరోపించారు. కమలాపురంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులతో పాటు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టే పనులకు గ్రామసభలు నిర్వహించి గ్రామ సభ తీర్మానం మేరకు పంచాయతీ కార్యదర్శి, స్పెషలాఫీసర్ వీడీసీ ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ పలు గ్రామ పంచాయతీల అధికారులపై కొందరు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు వత్తిడి చేసి వారితో కుమ్మక్కై సభలు నిర్వహించకుండా అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానం, వీడీసీ ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా గ్రామసభలు నిర్వహించి తీర్మానం ఇవ్వాలని లేని పక్షంలో కలెక్టర్‌కు, పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఆయన వెంట బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అహ్మద్ హుస్సేన్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌రెహమాన్ ఉన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని దొడ్ల కొత్తూరు గ్రామానికి చెందిన కూలీలు వాజేడు వద్ద ఆటో బోల్తాపడి గాయాలపాలయ్యారు. దీంతో బాధిత కుటుంబాలను బీజేపీ మండల అధ్యక్షుడు గండెపల్లి సత్యం, పలువురు నాయకులు శనివారం పరామర్శించారు. వారి ఇంటి వెళ్లి యోగక్షేమాలను తెలుసుకున్నారు. గాయపడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిబాబు, కిషన్, ఎలేందర్, శ్రీనివాస్, జనార్దన్, రమేశ్ పాల్గొన్నారు.

కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం: మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ ప్రభాకర్ తండ్రి సమ్మయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోరిక గోవిందనాయక్, ఉమ్మడి భూపాలపల్లి జిల్లా రైతుబంధు అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య పరామర్శించారు. మృత దేహం వద్ద నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూజారి సత్యనారాయణ, వాసం రాంబాబు, మధుకర్, బాబు, రామారావు, కుర్సం బాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలి



మాట్లాడుతున్న సమ్మయ్య

కాటారం: ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది జాగ్రత్తగా చూసుకోవాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య తెలిపారు. మండలంలోని దామెరకుంట సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సౌకర్యాలు, వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని తెలిపారు. విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని వారికి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం తిని నాణ్యతను పరిశీలించారు. ఎంపీపీ వెంట సర్పంచ్ రఘువీర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మహేశ్ రవీందర్‌రావు, మాజీ ఎంపీపీ రాజనర్సయ్య, యూత్ కాంగ్రెస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కదారి విక్రమ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి మార్గాలతో ఆర్థికంగా ఎదగాలి



సీఎస్‌సీని ప్రారంభిస్తున్న పుట్ట మధు

పలిమెల: నిరుద్యోగులు ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని బీఆర్‌ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ సూచించారు. మండలంలోని బూర్గుగూడెంలో మినిస్ట్రీ ఆఫ్ ఐటీ ఆధ్వర్యంలో డిజిటల్ విలేజ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలను డిజిటల్ విలేజ్‌లుగా ఏర్పాటు చేయడం ద్వారా పేదలకు అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఇంటి దగ్గరే ఆర్థిక లావాదేవీలు, రెవెన్యూ పరమైన అంశాలు, బ్యాంక్ ఖాతాలు, ఇతరత్రా సేవలను సీఎస్‌సీ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వంద డిజిటల్ విలేజ్‌లుగా మార్చేందుకు మినిస్ట్రీ ఆఫ్ ఐటీ శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా నియోజకవర్గంలోని బూర్గుగూడెం ఎంపిక అయిందని వివరించారు.

స్థలాలను వెనక్కి తీసుకోవడం సరికాదు



మాట్లాడుతున్న బట్టు విజయ్‌మాదిగ

భూపాలపల్లిరూరల్: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన నివాస స్థలాలను ప్రస్తుతం వెనక్కి తీసుకోవడం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్‌మాదిగ తెలిపారు. జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు కేటాయించిన ప్లాట్లను కలెక్టర్ రద్దు చేయడంతో స్థానిక జర్నలిస్టులు నివాస స్థలాల వద్ద చేపట్టిన దీక్ష శనివారం 10 రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు బట్టు విజయ్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. పట్టాలను కలెక్టర్ రద్దు చేయకుండా ఆ స్థలాలను జర్నలిస్టులకే ఇవ్వాలన్నారు. ఇప్పటికే చాలా మంది జర్నలిస్టులు లక్షల రూపాయలు వెచ్చించి స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారన్నారు. ప్రభుత్వం, అధికారులు ప్లాట్లు రద్దు చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కాల్వ రాజేందర్‌మాదిగ, దోర్నాల భరత్, రేనుకుంట్ల రాజ్‌కుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూమయ్య

మల్హర్: రాష్ట్రంలో ఆదివాసీ కుటుంబాలు సాగు చేసుకున్న పోడు భూములకు ఎలాంటి షరతులు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వాలని నాయకపోడు సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టం భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొయ్యూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలిగించాలని, ఇతర కులాలను ఎస్టీ జాబితాలో కలపవద్దని కోరారు. గిరి వికాసం పథకం కింద ఆదివాసీలకు బోర్లను, మండల కేంద్రాలల్లో కమ్యూనిటీ స్థలాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఆదివాసీ గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించి దళిత బంధు మాదిరిగానే ఆదివాసీ బంధు ఇవ్వాలని కోరారు. అలాగే ఈనెల 14న మహదేవపూర్ ఐటీడీఏ కార్యాలయంలో 9 తెగలతో అత్యవసర సమావేశం నిర్వహిస్తునున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాయకపోడు సేవ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తుల ప్రత్యేక పూజలు



గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడలో శ్రీ అభయాంజనేస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శనివారం ధాన్యాధివాస కార్యక్రమాన్ని అర్చకుడు ఉదయచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధాన్యంను భక్తులు వారి ఇళ్ల నుంచి తోచినంత తీసుకువచ్చి సమర్పించారు. సుప్రభాతసేవ, గణపతి పూజ, మండపు పూజ, గణపతి హోమం, అభయాంజనేస్వామి మూలమంత్రం హోమం, పుష్పాధివాసంతోపాటు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం మంత్రపుష్పం, తీర్థప్రసాదం, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 2004–05 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలలో సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అక్తర్, రాకేష్, సతీష్, శివుడు, కిరణ్, సందీప్, ప్రసాద్, సాయిష, శోభారాణి, కవిత, సాధన, భారతి, మల్లేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా..



చైతన్య యాత్ర నిర్వహిస్తున్న సునీల్‌రెడ్డి, నాయకులు

కాటారం(మహాముత్తారం): ఎమ్మెల్యేగా మంథని ప్రజలు ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా అని బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మహాముత్తారం మండలం కొర్లకుంట, వజినపల్లి, స్తంభంపల్లి, ములుగుపల్లి, మహాముత్తారం, పోలారం, యామన్‌పల్లి గ్రామాల్లో శనివారం సునీల్‌రెడ్డి మంథని గోస బీజేపీ భరోసా ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. కొర్లకుంటలో బీజేపీ జెండా ఆవిష్కరించి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. పోడుభూములు, విద్య, వైద్యానికి సంబంధించిన సమస్యలపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే మారుమూల గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వైద్యం, విద్య, రవాణా, తాగునీటి వంటి వాటిని పూర్తి స్థాయిలో అందించేలా కృషి చేస్తానన్నారు. పారదర్శకమైన పాలన అందించడంతో పాటు మార్పే ధ్యేయంగా ముందడుగు వేస్తానని స్పష్టం చేశారు. ఈ ప్రాంత ప్రజల ఓటు భిక్షతో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు ఇక్కడి ప్రజలను విస్మరించారని ఆరోపించారు. పలు గ్రామాల్లో యువకులు బీజేపీలో చేరగా సునీల్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య, ప్రభారి అనిల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పిలుమర్రి సంపత్, మండల ఇన్‌చార్జ్ దుర్గం తిరుపతి, నాయకులు మోహన్‌రావు, భాస్కర్‌రెడ్డి, వసంతరెడ్డి, రంజిత్, శివ, దేవేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

చిట్యాల: తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని చల్లగరిగలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. చల్లగరిగ గ్రామానికి చెందిన బైరగోని రాజమల్లు విధి నిర్వహణలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతుండగా జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. తోటి కార్మికులు చూసి అతనిని హుటాహుటిన పరకాలలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎడమ కాలు, మడమ విరిగినట్లు గుర్తించి డాక్టర్లు చికిత్స చేస్తునట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడిని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గీత కార్మికుల సంఘం నాయకులు సహదేవ్, రమేష్, కుమార్ కోరారు.

ప్రమాదపుటంచున ప్రయాణం!

- ప్రైవేట్ వాహనాదారుల ఇష్టారాజ్యం
- పరిమితికి మించి తీసుకెళ్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



ఓవర్‌లోడ్‌తో కూలీలను తీసుకెళ్తున్న ట్రాలీ

మొగుళ్లపల్లి: గ్రామీణ యువత జీవనోపాధి కోసం ఎక్కువగా ఆటో, జీపు డ్రైవర్లుగా మారి జీవనాన్ని కొనసాగిస్తుంటారు. ఈ క్రమంలో పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలను నడుపడం వల్ల ప్రయాణికుల ప్రాణాలు గాలిలో దీపాల్లాగా మారుతున్నాయి. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన నడుపడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. పేపర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటో, జీప్, టాటామ్యాజిక్, టాటాఏస్ వంటి వాహనాలను నడుపుతున్నారు. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర నష్టం చవి చూడాల్సి వస్తోంది. ఇక జీపులో సీట్ కెపాసిటీ ఏడుగురు, చిన్న ఆటోలో నలుగురు, పెద్ద ఆటోలో ఏడుగురు, టాటా మ్యాజిక్‌లో ఏడుగురు ప్రయాణికులు ప్రయాణించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా 20 మందికి తగ్గకుండా ప్రయాణికులను ఎక్కించుకుని నడుతున్నారు. వ్యవసాయానికి వాడాల్సిన ట్రాక్టర్లను సైతం పంట పొలాల్లో పని చేసే దినసరి కూలీలను తరలించేందుకు వినియోగించడంతో ప్రమాదవశాత్తు పడిపోయిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఇలా ప్రతీ సంవత్సరం ఆటో, జీప్‌లతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాలం చెల్లిన వాహనాలతో ముప్పు

గ్రామాల్లో ఎక్కువగా కాలం చెల్లిన వాహనాలనే తక్కువ ధరకు తీసుకొచ్చి వాడడం వల్ల వాతావరణంపై తీవ్ర దుష్ప్రభావం పడుతోంది. కాలంచెల్లిన వాహనాలలో ఎక్కువగా కార్బన్ మోనాక్సైడ్ విడుదల కావడంతో వాతావరణం కలుషితమై మానవాళిపై ఎక్కువగా ప్రభావం చూపెడుతోంది. ఆర్టీఏ, పోలీస్ అధికారులు నామమాత్రపు తనిఖీలతో చేయడం వల్ల వాహనాదారులు నిబంధనలు పాటించడం లేదని విమర్శలు వస్తున్నాయి. కావున అధికారులు వాహనచట్టాన్ని విధిగా అమలు చేస్తే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిబంధనలు పాటించాలి



గ్రామాల్లో తిరిగే ఆటోలు, జీప్‌లు, టాటామ్యాజిక్ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్‌లతో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటాం. డ్రైవర్ తప్పని సరిగా లైసెన్స్‌ను కలిగి ఉండాలి. వాహనాల పేపర్లు లేని వాహనాలపై చట్టం ప్రకారం సీజ్ చేస్తాం.

– ఎస్సై శ్రీధర్

బండా ప్రకాశ్‌ను కలిసిన జెడ్పీటీసీలు



ప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీటీసీలు

చిట్యాల: తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌కు నామినేషన్ వేసిన ఎమ్మెల్సీ బండా ప్రకాశ్‌ను చిట్యాల, మొగుళ్లపల్లి జెడ్పీటీసీలు గొర్రె సాగర్, జోరుక సదయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నేడు(ఆదివారం) జరిగే శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం బండా ప్రకాశ్ పేరును ఖరారు చేయగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.